సాక్షి నిర్మల్

శుక్రవారం। 5। జనవరి। 2024



నమోదు కేంద్రాలకు బారులు..!

ప్రజాపాలన పేరిట ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో జనాలు హైరానా పడుతున్నారు. మీసేవ, ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. 9లో▸

ఉపకారవేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇంటర్, డిగ్రీ, సాధారణ వృత్తి నైపుణ్య కోర్సులు చదువుచున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.5 / 16.7

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఇంటలిజెంట్స్ కమిటీ ఏర్పాటు

నిర్మల్‌చైన్‌గేట్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ఈమేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇంటలిజెంట్స్ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతలు సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక రూపొందిచాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ వీరన్న, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, ఇన్‌కమ్ టాక్స్, కమర్షియల్ టాక్స్ అధికారులు, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి

నిర్మల్‌రూరల్: పది సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మేవా జిల్లా శాఖ రూపొందించిన వాల్ క్యాలెండర్‌ను సచివాలయంలో తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏర్పడింది ఉద్యోగుల ప్రభుత్వం అని, అన్ని సమస్యలకూ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ షబ్బీర్ అలీ, మహ్మద్ కలీముద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మసూద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ సర్ఫరాజ్, జిల్లా నాయకులు అన్సార్ అహ్మద్‌షేక్ నబీ తదితరులు పాల్గొన్నారు.

నేడే అవిశ్వాసం

- ఖానాపూర్ బల్దియాలో సమావేశం
- క్యాంపు నుంచే నేరుగా హాజరుకానున్న కౌన్సిలర్లు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై 9 కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు నేరుగా హాజరవుతారని తెలుస్తోంది. నిర్మల్ ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి రత్నాకళ్యాణి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. అవిశ్వాస నిర్ణయాన్ని ఖానాపూర్, తిమ్మాపూర్ వీడీసీలు వ్యతిరేకించడంతో ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. ఈ క్రమంలో అవిశ్వాస ప్రక్రియ సందర్భంగా ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉందని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

యాదాద్రి తరహాలో బాసర అభివృద్ధి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



క్యాంపు కార్యాలయంలోకి వస్తున్న ఎమ్మెల్యే

ముథోల్: చదువుల తల్లి శ్రీజ్ఞాన సరస్వతిదేవి కొలువైన బాసరను యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన తొలిసారి గురువారం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. వేదపండితుల సహాయంతో వాస్తు పూజతోపాటు గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యాలయానికి వచ్చిన బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు అన్నదానం చేశారు. ముథోల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసేలా చూస్తానని పేర్కొన్నారు. వారంలో నాలుగు రోజులు నియోజకవర్గ కేంద్రంలోనే ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మాజీ జెడ్పీటీసీ సర్సాగౌడ్, బాసర జెడ్పీటీసీ రమేశ్, నాయకులు తాటివార్ రమేశ్, పోతన్న, ఎంపీటీసీ భూమేశ్, జీవన్, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం.. ఓ పరీక్షే!



ప్రయోగ తరగతుల్లో ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

- జూనియర్ కాలేజీల్లో కానరాని పరికరాలు, రసాయనాలు
- నాలుగేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్స్
- ప్రయోగం చేయకుండానే పరీక్షలకు విద్యార్థులు?

నిర్మల్ ఖిల్లా: ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. గట్టిగా రెండు నెలల గడువు కూడా లేదు. అంతకన్నా ముందే.. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులు ప్రయోగం చేయకుండానే పరీక్షలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఇంటర్ విద్యలో కీలకమైన ప్రాక్టికల్స్‌కు నిధులు మంజూరు కాకపోవడంతో విద్యార్థులతో అధ్యాపకులు సాధన చేయించడం లేదు. దీంతో విద్యార్థులు నేరుగా పరీక్షలోనే ప్రాక్టికల్స్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రయోగాల పాత్ర కీలకం..

ఇంటర్ సైన్స్ గ్రూపు విద్యార్థులకు థియరీతోపాటు ప్రాక్టికల్స్ చాలా ముఖ్యం. చదువుకున్న పాఠాన్ని ప్రాక్టికల్‌గా నిరూపించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో సెకండియర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ తరగతులు సక్రమంగా సాగడం లేదు. ప్రభుత్వ కళాశాలలకు పంపిణీ కావాల్సిన ప్రయోగ పరికరాలు, రసాయనాలు చాలా కాలేజీల్లో లేవు. కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నాలుగేళ్లుగా ఇంతే...

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని పాలకులు, అధికారులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ఇంటర్మీడియట్ పరిధిలో 13 కళాశాలలు, కేజీబీవీ పరిధిలో 12 కళాశాలల్లో ఇంటర్ విద్య కొనసాగుతోంది. వీటితోపాటు గురుకులాల సొసైటీల ఆధ్వర్యంలో మరో 17 ఇంటర్ కళాశాలలు నిర్వహించబడుతున్నాయి. రానున్న ఫిబ్రవరిలో ప్రయోగం పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత పరికరాలు రసాయనాలు అందుబాటులోకి తేవాలని ఇందుకు సరిపడా నిధులను విడుదల చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అయితే 2014కు ముందు సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షల నిర్వహణ, ప్రాక్టికల్స్ తరగతుల కోసం ప్రత్యేక ఫీజును వసూలు చేసేవారు. ఇందుకు అవసరమైన సైన్స్ సామగ్రిని కొనేవారు. 2015లో ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తామని ప్రకటించింది. దీంతో అన్నిరకాల ఫీజులు వసూలు నిలిపివేశారు. ఆ తర్వాత రెండేళ్ల వరకు ప్రయోగ పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులను విడుదల చేసేది. కరోనా అనంతరం నిధులు విడుదల చేయడం లేదు. ప్రయోగాలకు అవసరమయ్యే ఉపకరణాలు, సామగ్రి, రసాయనాలు వంటి వాటి కి నిధుల కొరత ఏర్పడింది. దీంతో ప్రాక్టికల్ తరగతులు నిర్వహించడం లేదు. అధ్యాపకులు సొంతంగా చొరవ చూపి ప్రయోగ తరగతులు నిర్వహిస్తే తప్ప తరగతులు కొనసాగే పరిస్థితి లేదు. నాలుగేళ్ల కిందట పంపిణీ చేసిన రసాయనాలు, పరికరాలు, ప్రస్తుతం వినియోగించే స్థితిలో లేవని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి 1 నుంచి పరీక్షలు..

ఇదిలా ఉండగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిచాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈమేరకు షెడ్యూల్ విడుదల చేసింది. అయినా ప్రయోగ పరీక్షల నిర్వహణకు అవసరమయ్యే రసాయనాలు, సామగ్రి చాలా కళాశాలలకు సరఫరా కాలేదు. జిల్లాలోని కుభీర్, సారంగాపూర్, ఖానాపూర్, కడెం, మామడ తదితర మండలాల్లోని ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులు ప్రయోగాలు చేయడం లేదు.

రసాయనాలు, సామగ్రి కొరత..

జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలలో చదువుకునే విద్యార్థులు ప్రాక్టికల్స్ తరగతుల నిర్వహణ లేక అభ్యసనకు ఆటంకం ఏర్పడుతోంది. రసాయన ప్రయోగశాలలో బ్యూరెట్, పిపెట్, కోనికల్ ఫ్లాస్క్ తదితర పరికరాలు విద్యార్థులకు సరిపడా లేవు. హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నత్రికామ్లం వంటివి కూడా కాలం చెల్లినవి ఉన్నాయి. మరికొన్ని కళాశాలల్లో అవికూడా లేవు. జీవశాస్త్ర ప్రయోగాల కు క్రొమటోగ్రఫీలోని ఎసిటోన్, ఇథైల్ ఆల్కహాల్, ఫినాప్తలియన్, పెట్రోలియం ఈథర్ వంటివి అవసరముండగా సరిపడా నిధులు లేక వీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచడం లేదు.

జిల్లాలోని ఇంటర్ కాలేజీల వివరాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	13
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	2,376
కస్తూరిబా విద్యాలయాలు	12
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	645
గురుకుల సొసైటీలు, మెడికల్ కాలేజీలు	17
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	1,071
మొత్తం కాలేజీల సంఖ్య	42
మొత్తం విద్యార్థుల సంఖ్య	4,092

ఉన్నతాధికారులకు నివేదిక..

కరోనా పరిస్థితుల అనంతరం ప్రయోగ పరీక్షలకు సంబంధించి పరికరాలు, రసాయనాలు కొనేందుకు నిధులను విడుదల చేయడం లేదు. ప్రయోగ పరీక్షల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. పరీక్షల నాటికి అవసరమయ్యే పరికరాలు, రసాయనాలు అందుబాటులోకి తెచ్చేందుకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. కళాశాలల వారీగా అవసరమున్నవాటిని ప్రయోగ పరీక్షలకు ముందు సమకూర్చే ప్రయత్నం చేస్తాం.

– జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, నిర్మల్

బదిలీపై వెళ్తున్న ఎస్పీకి ఘనంగా వీడ్కోలు

- ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జానకి



కొత్త ఎస్పీకి బాధ్యతలు అప్పగిస్తున్న ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా ఎస్పీగా పనిచేసి హైదరాబాద్ ఎల్బీనగర్ డీసీపీగా బదిలీపై వెళ్తున్న ప్రవీణ్‌కుమార్‌కు పోలీస్ అధికారులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛాలు, మెమొంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వహించి శాంతిభద్రతల్లో మార్పు తీసుకొచ్చారని కొనియాడారు. అనంతరం పోలీస్ అధికారులు పూలు చల్లుతూ.. రాస్తా పరేడ్ నిర్వహించి వీడ్కోలు పలికారు. ఇందులో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, ఎస్సైలు దేవేందర్, సుమంజలి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్, యువరాజ్, సాయినాథ్‌రెడ్డి, దశరథ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొత్త ఎస్పీ

జిల్లా ఎస్పీగా డాక్టర్ జానకిషర్మిల గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రవీణ్‌కుమార్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాకు సంబంధించిన శాంతి భద్రతల వివరాల గురించి చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు హోంగార్డుస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం గండి రామన్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్, సీఐలు, ఎస్సైలు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రవీణ్‌కుమార్‌పై పూలుచల్లుతున్న పోలీస్ అధికారులు

దూరం తగ్గేదెన్నడో?



సీహెచ్ కొండూర్ వరకు ఏడాది కింద వేసిన కంకర రోడ్డు

- నత్తనడకన లోకేశ్వరం–నందిపేట్ రోడ్డు పనులు
- ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పనులు
- రెండు జిల్లాల ప్రజలకు తప్పని దూరభారం

లోకేశ్వరం: నిర్మల్–నిజామాబాద్ జిల్లాల మధ్య దూరం తగ్గించేందుకు లోకేశ్వరం మండలం పంచగుడి వద్ద గోదావరిపై వంతెనతోపాటు, ఇరువైపులా 20 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి చేపట్టిన పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే గోదావరిపై వంతెన నిర్మించి నిజామాబాద్ జిల్లాకు రాకపోకలు కలిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో ఇచ్చిన మాట మేరకు 2015లో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. 2016లో టెండరు ప్రక్రియ పూర్తి చేసుకుని వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో వంతెన, రోడ్డు నిర్మాణ పనులు చకచకా జరిగాయి. తమకు దూరభారం తప్పుతుందని రెండు జిల్లాల ప్రజలు సంతోషపడ్డారు. కానీ ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. మొదలు పెట్టి ఎనిమిదేళ్లవుతున్నా ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లు సాగాయి. గడువు ముగిసి నాలుగేళ్లు దాటింది. రహదారి నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు.

వంతెన పనులు పూర్తి..

2016లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగానే గోదావరికి వరదలు వచ్చాయి. నీటి ఉధృతి పెరగడంతో వారధి పనులు ఆగిపోయాయి. ఆరు నెలల తర్వాత వరద తగ్గడంతో వంతెన పనులు తిరిగి ప్రారంభించి చకచకా చేశారు. 2019 జూన్ నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేశారు.

రోడ్డుకు అడ్డంకులు

లోకేశ్వరం నుంచి పంచగుడి వరకు రహదారి నిర్మాణానికి 51.39 ఎకరాల భూమిని సేకరించారు. దీనికి సంబంధించిన పరిహారం మంజూరు కాగానే పనులు మొదలు పెట్టాలని కాంట్రాక్టర్ భావించారు. అయితే ఇళ్లకు సంబంధించిన పరిహారం అందకపోవడం, ఇంతలోనే కరోనా రావడంతో పనులు ఆగిపోయాయి. వీటన్నింటినీ అధిగమించి ఆరు నెలల కిందట తిరిగి పనులు ప్రారంభించారు. కానీ, ఇళ్లు కోల్పోయిన వారు పరిహారం తక్కువగా ఇచ్చారని నిర్వాసితులు మళ్లీ అడ్డం తిరిగారు. దీంతో కథ మొదటికి వచ్చింది. ఇక నిజామాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి. అక్కడి నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం కారణంగా నాలుగేళ్లు పనులు ఆగిపోయాయి. నందిపేట్ నుంచి సీహెచ్ కొండూరు వరకు కొనసాగిన పనులు అక్కడే ఆగిపోయాయి. ఊరి నుంచి చాముండేశ్వరి మందిరం వరకు చేపట్టిన భూసేకరణలో ఇనాం భూములు ఉన్నాయి. ఇప్పుడు ఆ భూమికి పరిహారం ఇవ్వకపోయినా తమకు మిగిలిన భూమికి పట్టాలు ఇవ్వాలని నిర్వాసితులు పట్టుపడుతున్నారు. పనులను అడ్డుకుంటున్నారు. ఒకవైపు ఏళ్లు గడిచిపోతున్నాయి. ఇంకోవైపు పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో తాను ఈ పనులు చేయలేనని కాంట్రాక్టర్ ఆర్‌అండ్‌బీ ఈఎన్సీకి నివేదించి చేతులెత్తేశాడు.

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు..

రెండు జిల్లాల రహదారిపై నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నారు. కానీ రోడ్ల దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని వారికి విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం అయినా సమస్య పరిష్కరించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన రోడ్డు నిర్మాణం ప్రొఫైల్..

- పంచగుడి వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణం, ఇరువైపులా 20 కి.మీ రహదారి నిర్మాణం
- వంతెన వ్యయం రూ.108 కోట్లు
- వంతెన పొడవు 600 మీటర్లు
- వంతెన వెడల్పు 50 అడుగులు
- పనులు ప్రారంభం 2016లో
- పనులు పూర్తవ్వాల్సిన గడువు 2018
- భూసేకరణ : నిజామాబాద్ జిల్లాలో 61.30 ఎకరాలు
- నిర్మల్ జిల్లాలో 51.39 ఎకరాలు

ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం

పంచగుడి గోదావరినదిపై వంతెన పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు ఈ రహదారికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందకపోవడం, తర్వాత కరోనా ప్రభావం, చేసిన పనులకు బిల్లులు ఆగిపోవడంతో రహదారికి ఆటంకాలుగా మారాయి. ఇటీవలే పనులు ప్రారంభించిన రైతులు పరిహారం తక్కువ ఇచ్చారని పనులను అడ్డుకున్నారు. నిజామాబాద్‌వైపు కూడా రైతుల ఆందోళనతో పనులు జరగడం లేదు. పనుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తూ నే ఉన్నాం. నెల రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

– కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ

ఆరని ఇథనాల్ మంటలు



నిరసనలో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకుడు

- పోలీసుల లాఠీచార్జిపై రైతుల శాంతియుత నిరసన
- దిలావర్‌పూర్‌లో వంటావార్పు
- భారీగా పోలీసు బలగాల మోహరింపు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలని దిలావర్‌పూర్‌తోపాటు, గుండంపల్లి, న్యూలోలం, బన్సపల్లి తదితర గ్రామాల ప్రజలు ముక్త కంఠంతో నినదిస్తున్నారు. బుధవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయగా, పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇందులో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి గురువారం దిలావర్‌పూర్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈమేరకు శాంతియుతంగా నిరసన తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో నిర్మల్–భైంసా రహదారి పక్కన వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇథనాల్ ఫ్యాక్టరీపై ఇప్పటికే రైతుల్లో ఎంతో చైతన్యం వచ్చిందని, ఫ్యాక్టరీ అనర్థాలను జేఏసీ నాయకుడు విజయ్‌కుమార్ వివరించారు. ఫ్యాక్టరీతో రైతుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫ్యాక్టరీ తరలించేంత వరకూ పోరాటం..

దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ పచ్చని పంట చేల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించేవరకూ పోరాటం ఆపేది లేదని, ఇందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని దిలావర్‌పూర్, గుండంపల్లి వాసులు అంటున్నారు. తమ గోడు వినేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించాలని వేడుకున్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. నిరసనలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భారీగా పోలీసుల మోహరింపు...

దిలావర్‌పూర్ బంద్ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం పరిస్థితి ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజలు ఫ్యాక్టరీవైపు వెళ్లకుండా 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇథనాల్ పాపం గత పాలకులదే

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్య గత పాలకుల పాపమే అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం, పాలకులు అనాలోచితంగా ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని వెల్లడించారు. రైతులతో కలిసి మంత్రి, సీఎంను కలుస్తామని పేర్కొన్నారు. రైతులు సంయమనం పాటించాలని సూచించారు. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా అధికారులతో మాట్లాడానని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించానని తెలిపారు. రైతులపై కేసులు పెట్టొద్దని పోలీసులకు సూచించారు.



వంటావార్పు అనంతరం రోడ్డుపైనే భోజనం చేస్తున్న రైతులు, గ్రామస్తులు

సదర్మాట్ నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల్లోని సదర్మాట్ ఆయకట్టు యాసంగి పంటల కోసం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం నీటిని విడుదల చేశారు. మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ వద్ద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. చివరి భూములకు కూడా నీరందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, సర్పంచ్ గుగ్లావత్ రాజునాయక్, నాయకులు దయానంద్, జంగిలి శంకర్, మాజిద్, అలెగ్జాండర్, రమేశ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న 60 మందిపై కేసు

దిలావర్‌పూర్: ఇథనాల్ ఫ్యాక్టరీ ఆపివేయాలంటూ ఆందోళన చేస్తున్న పలువురిపై బుధవారం రాత్రి పోలీసులు కేసులు నమోదు చేశారు. కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 60 మందిపై కేసు నమోదు చేసినట్లు దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. ఐదు సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు పెట్టినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలి



మేనేజర్ కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

కుంటాల: బీడీ కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్నాయని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డాకూర్ తిరుపతి ఆరోపించారు. దోపిడీని అరికట్టాలని కుంటాల మండలం కల్లూర్ దేశాయి బీడీ పరిశ్రమలో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సంస్థ తయారుచేసిన ఉత్పత్తులను తీసుకోవాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, నాయకులు బర్కుంట గంగారాం, చందుల సాయికిరణ్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాప్ సీజ్!

ముధోల్: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని విజయలక్ష్మి ఫర్టిలైజర్ షాప్‌ను వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ సీజ్ చేశారు. రైతులకు యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేశారు. అధిక ధరలకు విక్రయించినట్లు తేలడంతో షాప్‌ను సీజ్ చేశారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాథు

ఉట్నూర్‌రూరల్: అడవిపందుల దాడిలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సాలెవాడ (కే) గ్రామానికి చెందిన రైతు పడ్వాల్ నాథు బుధవారం రాత్రి పంటచేనుకు కాపలాగా వెళ్లాడు. అడవిపందులు దాడి చేయడంతో గట్టిగా కేకలు వేశాడు. అరుపులు విన్న చుట్టు పక్కల రైతులు ఇంద్రవెల్లి ఆస్పత్రికి తరలించారు. రైతులపై అడవిపందుల దాడులు అధికమయ్యాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడితో పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఒక యువకుని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పత్తం అభిరామ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి రైలుమార్గం ద్వారా గంజాయి తీసుకువస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గురువారం రైల్వేస్టేషన్‌లో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 68 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జలపాతం వద్ద సినిమా చిత్రీకరణ

గుర్రపు స్వారీ చేస్తున్న హీరో విష్ణు



భటుల వేషధారణలో కుంటాల యువకులు



హీరో కిరిటీ



నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం వద్ద గురువారం స్వాగ్ చిత్ర నిర్మాణ షూటింగ్ జరిగింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విష్ణు, కిరిటీ హీరోలుగా రీతువర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భటుల పాత్రలో కుంటాల యువకులు నటిస్తున్నారు. జలపాతం వద్ద రాజు, భటులపై సన్నివేశం చిత్రీకరించారు. ఈ చిత్రం పూర్వ కథ నేపథ్యంలో నిర్మిస్తున్నట్లు డైరెక్టర్ అషిత్‌గోలి తెలిపారు. అటవీ శాఖ అధికారులు వారికి సూచనలు చేశారు. ఇందులో ఎఫ్ఎస్ఓ వసంత్‌కుమార్, ఎఫ్‌బీవో సచిన్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరకు సన్నద్ధం



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర
- 12న నాగోబా దర్బార్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఐటీడీఏ పీవో సమీక్ష
- భక్తులకు ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు
- జాతరకు మంత్రులు వచ్చే అవకాశం ఉందన్న రాహుల్‌రాజ్



నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవం, పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో మెస్రం వంశీయులు బస చేసే గోవడ్ స్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. గతేడాది శాఖల వారీగా చేసిన ఏర్పాట్ల వివరాలు పరిశీలించారు. ఈ ఏడాది చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రణాళిక తయారుచేసి నివేదిక అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా 12న నాగోబా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల మంత్రులు రానున్నట్లు తెలిపారు. శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గోవడ్ వద్ద, మర్రిచెట్టు, పోలీస్ క్యాంపు, జాతర నిర్వహణ స్థలాల్లో తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు, మెండపల్లి నుండి నాగోబా ఆలయం వరకు, హర్కపూర్ చౌక్ నుండి కేస్లాపూర్ వరకు రోడ్లకు మరమ్మతు చేయాలన్నారు. ఈ పనులన్నీ ఈనెల 30 లోగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందువల్ల ఈసారి జాతరకు మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పగించిన బాధ్యతలను గడువులోగా పూర్తి చేసి జాతర విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఆదివాసీ నాయకుడు ఆర్క ఖమ్ము మాట్లాడుతూ గత జాతరలో దొంగతనాలు, మట్కా జూదం వంటి సంఘటనలు జరిగాయని, ఈసారి అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని కలెక్టర్, పీవోను కోరారు. జాతరలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల ధర ఏటా పెంచుతుండడంతో వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. దీనిపై కూడా ఆలోచించాలన్నారు. జాతరలో వచ్చే ఆదాయం, ఖర్చులను సామాన్య ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులో నమోదు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఈసారి పోలీసు బందోబస్తు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీపీ రామకృష్ణ, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశ ఉద్యోగులు మనోహర్, సోనేరావ్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణంలో లోపించిన నాణ్యత

- కట్టిన మరుసటిరోజే కూలిన బేస్‌మెంట్



కుంగిన బేస్‌మెంట్

పెంబి: నాణ్యత లోపంతో గ్రామ పంచాయతీ భవనం బేస్‌మెంట్ కట్టిన మరుసటిరోజే కూలిన సంఘటన మండలంలోని తాటిగూడలో చోటు చేసుకుంది. మండలంలోని తాటిగూడలో రూ.20 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ నాణ్యత లోపంతో పనులు చేపట్టడంతో భవనం బేస్‌మెంట్ నిర్మించిన మరుసటిరోజే కూలిపోయింది. గ్రామస్తులు సదరు కాంట్రాక్టర్‌ను నిలదీయడంతో కట్టిన వెంటనే నీళ్లు పట్టడంతో ఇలా జరిగిందని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై సంబంధిత ఏఈని ఫోన్ ద్వారా సంప్రదించగా భవనానికి ఉండాల్సిన పిల్లర్లు బాగుంటే సరిపోతుందని, బేస్మెట్ అవసరం లేదని సమాధానం ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. బేస్మెట్ కూలిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా ఏ అధికారి పరిశీలించలేదని, కాసులకు కక్కుర్తి పడి ప్రజాధనాన్ని మింగేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్, ఏఈపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై 'సాక్షి' పీఆర్ ఏఈ అన్వర్‌ని ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు. సర్పంచ్ తానాజీ, గ్రామస్తులు రాజేందర్, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

ముధోల్: ముధోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో జిల్లా కబడ్డీ అసోషియేట్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 200(70 మంది బాలికలు 130 మంది బాలురు) మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపికచేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 14న సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా క్రీడల అధికారి నపేఖాన్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజేందర్, పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ సాయినాథ్, అసోషియేషన్ సెక్రెటరీ సునీల్, జాయింట్ సెక్రెటరీ కె.రాముగౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రేమలత, పలు పాఠశాలల పీఈటీలు, పీడీలు పుష్పలత, సంజీవ్, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అటవీ గ్రామాలను తరలించాలి

- ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జు



పునరావాస కాలనీ పనులను పరిశీలిస్తున్న బొజ్జు

కడెం: కవ్వాల్ టైగర్ జోన్ నుంచి రాంపూర్, మైసంపేట్ గ్రామాలను నిబంధనల ప్రకారం తరలించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీలో ఇళ్లను గురువారం పరిశీలించారు. ఇళ్లు నాణ్యతగా లేవని ఇటీవల రాంపూర్, మైసంపేట్ వాసులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి, పునరావాస ప్రక్రియ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

గోండుగూడ వాసులకు న్యాయం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ వాసులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. గోండుగూడలోని పోడు భూములను పరిశీలించారు. రాంపూర్, మైసంపేట్ వాసులతోపాటు గొండుగూడ వాసులకు పోడు భూములు దక్కేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీపీ అలెగ్జాండర్, కాంగ్రెస్ నాయకులు వాజీద్‌ఖాన్, ఇందూర్‌నేత, సత్తెన్న, సత్యం తదితరులు ఉన్నారు.

‘ఆళ్వారుల సంప్రదాయ పరిరక్షణనే లక్ష్యం’



దీపోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ దంపతులు

నిర్మల్‌టౌన్: ఆళ్వారుల సంప్రదాయ పరిరక్షణమే ఏడీపీపీ (ఆళ్వారు దివ్య ప్రబోధ ప్రాజెక్టు) లక్ష్యమని టీటీడీ పర్యవేక్షకులు వంశీకృష్ణమాచార్య అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో స్థానిక దేవరకోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో రామకన్నన్ స్వామివారిచే నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని దశదిశలా వ్యాప్తి చేసేందుకు ఏడీపీపీ కృషి చేస్తోందన్నారు. భక్తులు ఈ ప్రవచనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేవరకోటలో దీపోత్సవం

జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో గురువారం దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని గుత్తి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమెడ శ్రీధర్, అర్చకులు నవీన్, గోపి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

- ఇరువురికి గాయాలు
- వన్‌టౌన్‌లో కేసు నమోదు





దాడిలో గాయాల పాలైన యువకులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని డైట్ మైదానం వద్ద గురువారం యువకులు ఘర్షణకు దిగారు. మావల సమీపంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేసే ఇద్దరు యువకుల మధ్య ఉన్న పాత గొడవలే ఈ దాడికి కారణంగా చెప్పుకుంటున్నారు. ఇందులో నుంచి ఓ యువకుడు మధ్యాహ్న సమయంలో డైట్ గ్రౌండ్‌లో క్రికెట్ చూస్తుండగా మరో యువకుడు తన స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో ఇరువురు రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన యువకులు స్నేహితులను పిలవడంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు గమనించి వారిని నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. విడిపించడానికి వెళ్లిన ఓ యువకుడికి సైతం గాయాలయ్యాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై వన్‌టౌన్ పోలీసులను సంప్రదించగా కజ్జర్లకు చెందిన వేణుకుమార్, తిర్పెల్లికి చెందిన ఆశిష్ వేర్వేరుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు సంజీవ్, సతీష్, మధుకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదైనట్లు ఎస్సైలు ఉదయ్‌కుమార్, నారాయణ తెలిపారు. ఇద్దరు గొడవ పడుతుంటే తాము విడిపించేందుకు వెళ్లామని, దీంతో వారు తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం ఇంద్రానగర్‌కు చెందిన గద్దల వెంకటేశ్ (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. అతని భార్య లక్ష్మి ఇటీవల క్రిస్మస్ వేడుకలకు కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితమే అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి గురువారం డిశ్చార్జి కావడంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గిజిగాడి గూడు... నైపుణ్యం చూడు



బావిలోకి వేలాడుతున్న గిజిగాడు అల్లిన గూళ్లు

- ఇంజినీరింగ్ నైపుణ్యం 'గిజిగాడు పక్షి' సొంతం..
- నేడు జాతీయ పక్షుల దినోత్సవం



గూడులో 'గిజిగాడు పక్షి'

నిర్మల్ ఖిల్లా: అత్యద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో 'గిజిగాడు పక్షి' నిర్మించిన 'వేలాడే గూళ్లు' చూపరులను అబ్బురపరుస్తున్నాయి. నిర్మల్ రూరల్ మండలంలోని కొట్ల(కె) నుంచి జాఫ్రాపూర్ వెళ్లేదారిలో ఓ వ్యవసాయ బావికి ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలకు ఏర్పాటు చేసుకున్న గూళ్లు ఆ దారివెంట వెళ్తున్న వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ పక్షిజాతిలో మగపక్షి మాత్రమే చక్కని ఇంజినీరింగ్ ప్రతిభతో అందంగా గూడును అల్లి ఆడ గిజిగాడిని ఆకర్షిస్తుంది. ఆడపక్షికి ఆ గూడు నచ్చితే అందులో ఆవాసం ఏర్పరుచుకుని మగపక్షితో సహవాసం చేస్తూ జీవనం గడుపుతుంది.

ఎంతో నేర్పరితనం..

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కలిగి ఉంటుంది. గూళ్లు అల్లడం, పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కోవడం.. పాములు, ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లనూ పిల్లల్నీ కాపాడుకోవడానికి గూళ్లను ముళ్లచెట్లపైన, నీటికి దగ్గరగా కిందకు వేలాడేరీతిలో కట్టుకోవడం వీటి అద్భుతమైన తెలివికి నిదర్శనం. నేడు 'జాతీయ పక్షుల దినోత్సవం' సందర్భంగా 'సాక్షి' ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించింది.

కొంగ ‘వల’లో చేప చిక్కకుండా..



చెరువుల్లో చేపలను పట్టేందుకు సాధారణంగా వలను ఉపయోగిస్తారు. కానీ ఇక్కడ వాటి రక్షణ కోసం ఓ రైతు వలను ఉపయోగిస్తుండటం ఆసక్తి కరంగా మారింది. జైనథ్ మండలంలోని తర్నం గ్రామానికి చెందిన బోయర్ లక్ష్మణ్ తనకున్న ఎకరం నర చేనులో చేపల చెరువును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో వేసిన చేపలను కొంగలు తినకుండా ఉండేందుకు ఇలా చేపల వేటకు ఉపయోగించే నెట్‌నే రక్షణ కవచంగా ఏర్పాటు చేశాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్